క్లుప్తంగా

1,2న 'గడప గడపకూ మన ప్రభుత్వం'

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో జూలై 1, 2 తేదీల్లో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

విశ్వేశ్వరరెడ్డిని విమర్శించే స్థాయి లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనను విమర్శించే స్థాయి జనసేన నాయకులకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరం బాషా, పార్టీ యువజన విభాగం నియోజకవర్గ నాయకులు సింగాడి ధన, వడ్లసలీం, ముల్లాజిలాన్‌బాషా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఎమ్మెల్సీ పోతుల సునీతపై జనసేన పార్టీ నాయకులు గౌతం తదితరులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గ అభివృద్ధిపై జనసేన నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మన్, రఫీక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


రూ.లక్ష నగదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విడపనకల్లు: మండలంలోని పాలికి గ్రామానికి చెందిన బోయజ్యోతికి గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు రూ.లక్ష నగదు అందించారు. రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ ఈశ్వర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు నలుగురు కుమార్తెలు ఉండటంతో.. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి మాజీ ఎమ్మెల్యే విశ్వ, యువనేత ప్రణయ్ ఆదేశాల మేరకు రూ.లక్ష అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగేంద్ర, మాధవరెడ్డి, నాగిరెడ్డి, వరదరెడ్డి, మల్లయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంతలో పడిన ఎద్దు


ఎద్దును బయటకు తీస్తున్న గో సంరక్షక దళ సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు సీతమ్మ మిల్లు సమీపంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటి వద్ద భారీస్థాయిలో తీసిన నీటి సంపు(గుంత)లో పడిన ఎద్దును గో సంరక్షక దళ సభ్యులు సురక్షితంగా బయటకు తీశారు. ఉదయం రెండు ఎద్దులు పొట్లాడుకుంటూ. ఒక ఎద్దు సంపులో పడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న గోసంరక్షక దళ సభ్యులు క్రేన్ సహాయంతో ఎద్దును సురక్షితంగా బయటకు తీసి సేవా నిరతిని చాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


రాయదుర్గం: మత గురువుకు శుభాకాంక్షలు తెలుపుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం,కళ్యాణదుర్గం, ఉరవకొండ సాక్షి బృందం: బక్రీద్ పండుగను రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పేదలు, బంధువులకు మాంసంతో చేసిన వంటకాలను అందించారు. అల్లా ప్రసన్నుడైన దినంగా చెప్పుకునే బక్రీద్ వేడుకల్లో పిల్లలు, పెద్దలు అన్న తేడా లేకుండా ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పవిత్రమైన హృదయంతో అల్లాను ప్రార్థించి ముక్తిని ప్రసాదించమని వేడుకున్నారు. త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ ప్రాశస్త్యాన్ని మత పెద్దలు, గురువులు వివరించారు. ఈ సందర్భంగా విప్ కాపు రామచంద్రారెడ్డి కణేకల్లు, బళ్లారి రోడ్డుల్లోని ప్రధాన ఈద్గాల వద్దకు చేరుకుని ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలిపారు. విప్ మాట్లాడుతూ త్యాగనిరతి, సేవ, భక్తి భావానికి ప్రతీక అయిన 'ఈదుల్ అజ్‌ఉహా' బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు పవిత్రంగా జరుపుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈద్గాల వద్ద ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.


కంబదూరు: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


బొమ్మనహాళ్: ఉంతకల్లులోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గుమ్మఘట్ట: గలగల గ్రామంలో ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కణేకల్లు: ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు




కళ్యాణదుర్గం: ఈద్గా మైదానంలో నమాజు నిర్వహిస్తున్న ముస్లిం మత పెద్దలు, ఉరవకొండ, వజ్రకరూరులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


కుందుర్పి: ఎనుములదొడ్డిలో ముస్లింల ప్రార్థనలు


కూడేరు: పార్థనలు చేస్తున్న ముస్లింలు

పథకాలను ప్రజలే మెచ్చుకుంటున్నారు


బొమ్మనహాళ్: ఎల్‌బీ నగర్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


బెళుగుప్ప: తగ్గుపర్తి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బొమ్మనహాళ్: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు మెచ్చుకుంటున్నారని, ప్రతిపక్షాలు మాత్రం ఓర్వలేక, రాజకీయ మనుగడ కోల్పోతామని ఆరోపణలు చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విప్ కాపు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు విప్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఏకైక సీఎంగా జగనన్న కొత్త చరిత్ర సృష్టించారన్నారు. పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. చంద్రబాబు కోసమే రోడ్డెక్కిన పవన్‌కల్యాణ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, పార్టీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు యోగేశ్వరరెడ్డి, వీరన్నగౌడ్, కోటేశ్వరరెడ్డి, జయరామ్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటాక్షిపతిరెడ్డి, వన్నూరుస్వామి, జి.ఎం.నాయుడు, లక్ష్మీనారాయణ, నుంకేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గుపర్తిలో ఘన స్వాగతం

బెళుగుప్ప: టీడీపీకి పట్టున్న గ్రామాల్లో సైతం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో రెండో రోజు గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలకు మాజీ విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, ఏఓ పృథ్వీసాగర్, ఎస్‌ఐ రామకృష్ణయ్య, వాల్మీకి కార్పొరేషన్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు రామాంజనేయులు, గోవిందులు, ఎంపీపీ పెద్దన్న, వైస్ ఎంపీపీ పుష్పావతి, సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు మమత, సర్పంచ్‌లు రమేష్, ఎండీ పెద్దన్న, పురుషోత్తం, ఎంపీటీసీలు ప్రసాద్, వీరబొమ్మన్న, ఈశ్వర్, నాయకులు త్రిలోక్‌రెడ్డి, పాటిల్ నాగిరెడ్డి, రాజగోపాల్, డీలర్ ఎర్రిస్వామి, ఎస్‌కే ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్


75వీరాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్ స్థానంలో ఉందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని 75 వీరాపురం గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్డు సౌకర్యం లేక చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి విన్నవించారు. ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయించి, గురువారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓర్వలేని టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి అభివృద్ధిని అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీకి కాలం చెల్లిందని విమర్శించారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు రోజుకో మాట మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ చులకనవుతున్నాడని ధ్వజమెత్తాడు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీటీసీ గోనబావి గోవింద, కాంట్రాక్టర్లు ఆర్టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి , సర్పంచ్‌లు రమేష్, ఉమేష్, రాజేష్, మాజీ సర్పంచ్ రంగప్ప, నాయకులు బోయ రవి, ఎర్రిస్వామి, గోవిందరెడ్డి, రుద్రరెడ్డి, గోపాల్ పల్లక్కిరెడ్డి, గొల్ల ఈరన్న, అడిగుప్ప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు టీడీపీ నాయకుడి బెదిరింపు

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి కొండపై ఉన్న రాళ్లను తీసుకుంటే తనకు డబ్బులు చెల్లించాలంటూ టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అనుచరుడు కాంతారావు గ్రామస్తులపై విరుచుకుపడ్డాడు. వివరాలు.. కొంతమంది పేదలు ఇల్లు నిర్మించుకోవడానికి రాళ్లు అవసరమై దేవగిరి కొండకు వద్దకు వెళ్లి ట్రాక్టర్‌లో రాళ్లు తెచ్చుకొంటుండగా టీడీపీ నాయకుడు కాంతారావు తన కారులో వచ్చి ట్రాక్టర్లు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై కారు అడ్డు పెట్టాడు. దేవగిరి కొండలో నుంచి ఒక్కరాయి కూడా ఎవ్వరూ తీసుకోకూడదు.. రాళ్లు కావాలంటే ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.800 చెల్లించాలంటూ డిమాండ్ చేశాడు. కొండను లీజుకు తీసుకున్నానని, డబ్బులు కట్టి రాళ్లు తీసుకెళ్లాలంటూ పేద ప్రజలపై విరుచుకుపడ్డాడు. ఎవడు వచ్చినా నేను మాట వినను.. నా వెనుక మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఉన్నాడని గ్రామస్తులను బెదిరంచాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు టీడీపీ నాయకుడిపై ఎదురుతిరిగారు. ఎస్‌ఐ శివ అక్కడకు వెళ్లి గ్రామస్తులకు నచ్చజెప్పి పంపారు.

టీడీపీ పరువు గోవిందా!

కళ్యాణదుర్గం: టీడీపీ చేపట్టిన భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్రతో కళ్యాణదుర్గంలో ఆ పార్టీ పరువు పోయింది. ఏకంగా బస్సు యాత్రకు వచ్చిన పార్టీ పరిశీలకులు, ఇతర నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేల ముందే మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు వర్గాలు తన్నుకోవడంతో ఉన్న పరువు పోయిందంటూ పలువురు కార్యకర్తలు నాయకులపై బాహాటంగా మండిపడుతున్నారు. ఇంత జరిగిని నియోజకవర్గంలో చేపట్టిన బస్సు యాత్ర తమ వల్లే సక్సెస్ అయ్యిందని ఇరు వర్గాలు గొప్పలు చెప్పుకోవడం కొసమెరుపు.కాగా కళ్యాణదుర్గంలో టీడీపీ బస్సు యాత్రపై ఆ పార్టీ పెద్దలు ఆరా తీసినట్లు సమాచారం. కుందుర్పిలో ప్రారంభమైనప్పటి నుంచి కళ్యాణదుర్గంలో యాత్ర ముగిసేవరకు ఉన్నం, ఉమా వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. బండమీదపల్లి, కుందుర్పి, గరుడాపురం గ్రామాల్లో ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకుని తన్నుకున్నారు. బస్సు యాత్రతో పార్టీలో ఉన్న పరువు పోయిందని, బస్సు యాత్ర ముగియగానే ఇరు వర్గాలకు క్లాస్ పీకే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

కళ్యాణదుర్గం రూరల్: మంత్రాలయంలో జూలై 4,5,6 తేదీల్లో నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ రాయలసీమ జిల్లాల విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. పట్టణంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, ఉపాధ్యక్షుడు హనుమంతు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: మంత్రాలయంలో జూలై 4,5,6 తేదీల్లో జరిగే ఏఐఎస్‌ఎఫ్ రాయలసీమ జిల్లాల విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుళ్లాయస్వామి, హనుమంతు పిలుపునిచ్చారు. కరపత్రాలను గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

'వైఎస్సార్ బీమా' పేదలకు వరం

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పథకం పేదలకు ఓ వరంలాంటిందని కళేకుర్తి సర్పంచు కె.భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మారెన్న అన్నారు. మండలంలోని కళేకుర్తిలో గురువారం దాసరి ధర్మేష్ (47) మృతిచెందాడు. ఆ కుటుంబానికి తక్షణసాయంగా వైఎస్సార్ బీమా కింద వారు రూ.10 వేలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బ్రహ్మసముద్రం: మండలంలోని పిల్లలపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డె ఈరన్న (84) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ తలారి గోవిందప్ప, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు.

వ్యక్తి మృతి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన కొల్లాట్ల ఎల్లప్ప కుమారుడు జయరాములు(38) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 27న కుటుంబ కలహాలతో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన విదితమే. కుటుంబీకులు అతడిని బళ్లారికి తరలించి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పాల్తూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెల మృతి

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన కర్రెజప్ప అనే గొర్రెల కాపారికి చెందిన రెండు గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. గురువారం ఉదయం ఆయన గొర్రెల మందను మేత కోసం గ్రామ శివారులోని పొలాలోకి తీసుకెళ్లాడు. ఓ తోటలో కిందపడిన విద్యుత్ వైర్లు తగిలి రెండు గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.20 వేల నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

కళ్యాణదుర్గం రూరల్: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ కాంస్య విగ్రహావిష్కరణకు యాదవులు తరలి రావాలని యాదవ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణ మందిరంలో గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆ సంఘం నాయకులు జీకే కృష్ణమూర్తి, మాజీ సర్పంచు వసుంధరమ్మ, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవి, కంబాలపల్లి శివన్న యాదవ్ తదితరులు మాట్లాడారు. జూలై 9న విజయవాడ-గుంటూరు మధ్యలో మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వారు తెలిపారు. యాదవ సంఘం నాయకులు కృష్ణమూర్తి, నాగరాజు, కృష్ణ, బాలశీన, బొమ్మలింగ, కిశోర్, శేషు, వీరేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్లో మార్పు

కూడేరు: మండలంలో జూలై 1 నుంచి చేపట్టబోయే 'జగనన్న సురక్ష' స్పెషల్ డ్రైవ్ షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా గురువారం తెలిపారు. రెండు బృందాలుగా కాకుండా మండల అధికారులంతా ఒకే బృందంగా వెళ్లి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు

వైభవంగా తొలి ఏకాదశి

- భక్తులతో కిటకిట లాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: అలంకరణలో పాండురంగడు


రాయదుర్గం: పూజలు నిర్వహిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు


కళ్యాణదుర్గం రూరల్: కోటవీధి లక్ష్మీనరసింహస్వామి


ఉరవకొండ: అలంకరణలో పాండురంగ, రుక్మిణి మూలవిరాట్


బొమ్మనహాళ్: ప్రత్యేక అలంకరణలో ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి


కళ్యాణదుర్గం రూరల్: అలంకరణలో శ్రీవారు


కుందుర్పి: అలంకరణలో కుందుర్పిమ్మ అమ్మవారు

సాక్షి బృందం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డులో ప్రసిద్ధి చెందిన పాండుగస్వామి దేవాలయంలో చేపట్టిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ శ్రీనివాస్‌యాదవ్, సీనియర్ కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజుతో కలసి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు.. హిందువులకు ఏకాదశి పర్వదినం నుంచే పండుగలన్నీ మొదలవుతాయన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

వైకుంఠ తొలి ఏకాదశిను పురస్కరించుకోని ఉరవకొండలోని పాండురంగస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన స్వామిని గరడ వాహనంపై ఊరేగించారు.

మోటార్లు, జనరేటర్ల చోరీ

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లి శివారులో రైతుల పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లు, జనరేటర్లు అపహరణకు గురైనట్లు గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంగమేశ్వర ఆలయానికి చెందిన జనరేటరు, మోటారుతో పాటు గ్రామానికి చెందిన దేవన్న, మారెన్న, రమేష్, రుద్రన్న, చిన్న మారెన్న, వన్నూరప్పలకు చెందిన వ్యవసాయ మోటార్లు, జనరేటర్లు మొత్తం 9 బుధవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. మొత్తం వీటి విలువ రూ.2.50 లక్షలు పైగా ఉంటుందని బాధితులు వాపోయారు. చోరీలపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు రైతులు తెలిపారు.